క్లుప్తంగా

గరుడాద్రిపై వెంకన్న కల్యాణ వేడుకలు నేడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు వెంకటేశ్వరమెట్ట (గరుడాద్రి)పై శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి గురువారం ఉదయం 9.30 గంటలకు 47వ వార్షిక కల్యాణ వేడుకలు జరుపనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30కు అంగ ప్రదక్షిణ, 7 గంటలకు తోమాల సేవ నిర్వహించనున్నారు. ఈ సేవలలో పాల్గొనేవారు ప్రధాన అర్చకులను 98660 30895 నంబరులో సంప్రదించాలని కోరారు. ఇకపై ప్రతి శనివారం తమ్మిన సింహాద్రి నాయుడు కుటుంబ సభ్యులచే నారాయణసేవ నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు కుసుమహర తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో పతకాలు


పతకాలు సాధించిన మహాలక్ష్మిపురం విద్యార్థులు

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 4న జరిగిన వాకో ఆంధ్రప్రదేశ్ 35వ రాష్ట్ర కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్- 2025 పోటీలలో భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ మహాలక్ష్మిపురం విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో టి.వెంకట్ సాయి వర్షిత్, బి.తులసికృష్ణ, ఎం.శ్రీనివాస్ కాటా, కుమిటి విభాగాలలో రెండేసి బంగారు పతకాలు సాధించారు. ఇంకా కె.దర్శిత్ బంగారు, బి.సాయిచరణ్ స్వర్ణ, రజత, పి.హర్షవర్ధన్, కె.కృతిక్ వర్ధన్ బంగారు, కాంస్య , వై.ధనుష్, ఎం.నితిన్, ఎస్.మహీధర్ కాంస్య, పి.మహదేవ్ రెండు రజత, సిహెచ్ ధనుష్ రజత పతకాలు సాధించారు. విజేతలను కోచ్ కర్రి చిట్టిబాబు, పంచాయతీ పెద్దలు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ సంగివలస ఫీడర్‌లో నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా అనిట్స్ కళాశాల, ఎస్ఆర్ఐ ఆసుపత్రి, సంగివలస దేవర వారి కళ్లాలు, ఇడదాసరిపేట, చిల్లపేట, ఊళ్లపేట, సంగివలస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆనందపురం మండల పరిధిలో..

తగరపువలస: ఆనందపురం మండలం 11 కేవీ పెద్దిపాలెం ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా పెద్దిపాలెం గ్రామంతో పాటు సోమి లే అవుట్ ప్రాంత గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భీమిలి సబ్ పోస్టాఫీస్‌కు ప్రథమ స్థానం


అవార్డును స్వీకరిస్తున్న సబ్ పోస్ట్‌మాస్టర్ చంద్రశేఖర్

భీమునిపట్నం: విశాఖ డివిజన్ పరిధిలోని భీమిలి సబ్ పోస్టాఫీస్‌కు తపాలా బీమాలో (పోస్టల్ ఇన్సూరెన్స్) రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. 2024-25 సంవత్సరానికి గాను తపాలా బీమాకు సంబంధించి ఎక్కువ పాలసీ ప్రీమియంలు కట్టించినందుకు ఈ స్థానం లభించింది. భోగాపురం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ బి.చంద్రశేఖర్‌కు ఆంధ్రప్రదేశ్ తపాలా సర్కిల్ విజయవాడ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాశ్ అవార్డును అందించి, అభినందించారు. విశాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్రకుమార్ మీనా, డిప్యూటీ సూపరింటెండెంట్ కోమల్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణ రాట


మద్ది సాధు మఠం వద్ద రాట వేస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్ది సాధు మఠంలో కొలువుదీరిన శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ రాట ఉత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం రాత్రి ఏడు గంటలకు కల్యాణ మహోత్సవం జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.10 కోట్ల భూమి కబ్జాకు స్కెచ్


దేవిమెట్ట వద్ద ఆక్రమణకు సిద్ధం చేసిన ప్రభుత్వ భూమి


ఆక్రమిత ప్రభుత్వ భూమిలోకి రాకపోకల కోసం ఏర్పాటు చేసిన రోడ్డు


ప్రభుత్వ భూమిగా చూపుతున్న అడంగల్

- దేవిమెట్టలో సర్వే నం.14లో గెడ్డ భూమి చదును
- అప్రోచ్ రోడ్డు వేసి అమ్మకానికి సిద్ధం
- అధికార పార్టీ అండతో చకచకా పనులు
- చూసీచూడనట్లు ఉంటున్న అధికారులు

ప్రభుత్వ భూముల ఆక్రమణకు ఎవరు పాల్పడినా సహించబోమంటూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. కింది స్థాయిలో మాత్రం ఎక్కడా చర్యలు చేపట్టిన దాఖలాలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. కొన్ని చోట్ల కూటమి నాయకులు తమ అనుచరుల ద్వారా ఆక్రమణలకు పాల్పడుతుంటే, మరికొన్ని చోట్ల వారే నేరుగా ఆక్రమణకు సిద్ధం అవుతున్నారు. మధురవాడ పరిధిలో కోట్ల రూపాయల విలువైన భూముల ఆక్రమణలే ఇందుకు నిదర్శనం.

మధురవాడ: మధురవాడలో జరుగుతున్న అనేక ఆక్రమణలు అధికార పార్టీ అండతోనే జరుగుతున్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అయినా, పట్టించుకునే నాథుడే లేక కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా విశాఖ రూరల్ మండలం కొమ్మాది రెవెన్యూ గ్రామం సర్వే నం.14లో సుమారు రూ.10 కోట్లు విలువ చేసే ఎకరా ప్రభుత్వ గెడ్డ భూమి ఆక్రమణకు స్కెచ్ వేస్తున్నారు.

ఆక్రమణ ఇలా..

కొమ్మాది రెవెన్యూ గ్రామంలో కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి అమరావతి కాలనీ-దేవిమెట్ట మీదుగా కింది ప్రాంతాలకు వర్షం నీరు ప్రవహించే గెడ్డ ఇది. ఈ గెడ్డలో సర్వే నంబరు 13లో 1.50 ఎకరాలు, 14లో 2.48ఎకరాలు, 15లో 68సెంట్లు గెడ్డ భూమి ఉంది. ఇందులో 14లో భూమి దేవిమెట్టకు అతి సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మి నరసింహ లే అవుట్, ప్రైవేటు భూములకు ఆనుకుని ఉండడంతో ఎవరికీ అనుమానం రాదని, ప్రభుత్వ భూమి ఆక్రమణకు పథకం రచించారు. దీంతో ఈ సర్వే నంబరులో సుమారు ఎకరం మేర భూమిలో తుప్పలు, డొంకలు తొలగించి చదును చేయడమే కాకుండా నీలగిరి మొక్కలు కూడా వేసేశారు. ఇంతటితో ఆగలేదు.. పక్కనే ఉన్న షిప్‌యార్డు లే అవుట్ (శ్రీ లక్ష్మి నరసింహా) నుంచి అప్రోచ్ కోసం 10అడుగుల వెడల్పు గల రోడ్డును కూడా సిద్ధం చేశారు. ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా కొద్ది రోజులుగా సాగుతోంది. నాయకుల్లో వాటాలు కుదరక వ్యవహారం బయటకు పొక్కింది. ఈ వ్యవహారం రెవెన్యూ అధికారుల దృష్టికి కూడా వెళ్లిందని, అధికార పార్టీని ఎదిరించలేక చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఆక్రమణలతో కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి పరాధీనం అయిపోతోందని, ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనంతుని మూలవిరాట్‌కు అభిషేకాలు

ఘనంగా శిఖర ప్రతిష్టాపనోత్సవాలు


గిరిపై అనంతుని ఆలయం చుట్టూ ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు


అనంతుని మూల విరాట్‌కు అభిషేకం చేస్తున్న అర్చకులు

పద్మనాభం: పద్మనాభంలోని అనంతుని గిరిపై శిఖర ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దీనిలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను, పూర్ణ కలశాన్ని పట్టుకుని అర్చక స్వాములు, భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, క్షీరాధివాసం, హోమాలు జరిగాయి. అనంతుని మూల విరాట్‌కు అర్చక స్వాములు అభిషేకాలు నిర్వహించారు. నిజ రూపంలో ఉన్న అనంతుని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడుతో పాటు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

20న సమ్మెను జయప్రదం చేయాలి


దివీస్ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇస్తున్న సిటు నాయకులు

తగరపువలస: ఈ నెల 20న చేపట్టనున్న అఖిల భారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని సిటు నాయకులు కోరారు. అందులో భాగంగా భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యానికి బుధవారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను అఖిల భారత కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ సమ్మెకు పిలుపు ఇచ్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయకుండా, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

రైతు భరోసా కేంద్రాలపై ప్రశంసల జల్లు


తాటితూరు రైతు భరోసా కేంద్రం వద్ద స్వదేశీ మత్స్యకారులతో బిహార్ మత్స్యశాఖ అధికారులు

- తాటితూరు కేంద్రాన్ని సందర్శించిన బిహార్ మత్స్యశాఖ అధికారుల బృందం
- ఆర్‌బీకేలు రైతులకు ఎంతో ప్రయోజనకరమని వెల్లడి

తగరపువలస: రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఎంతో అందుబాటులో ఉన్నాయని బిహార్ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ అభిషేక్ రంజన్ అన్నారు. ఈ కేంద్రాల వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కొనియాడారు. భీమిలిలోని చేపల కేంద్రాలు, ఫిష్ ల్యాండ్ సెంటర్లలో వారు విస్తృతంగా పర్యటించారు. తాటితూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని చూశారు. వారికి స్వదేశీ మత్స్యకారుల సహకార సంఘం ప్రతినిధులు స్వాగతం పలికారు. బృందం ప్రతినిధులు కేంద్రం లోపలికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి, రైతులతో ముచ్చటించారు. తాటితూరు స్వదేశీ మత్స్యకారుల నుంచి మత్స్యసాగులో మెలకువలు, రవాణా, వ్యాపార సూత్రాలు, వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రంలో జరిగిన మత్స్యకార సదస్సులో జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకుడు లక్ష్మణరావు సహకార సంఘం నియమ నిబంధనలు, కార్యకలాపాలు, విధి విధానాల గురించి వివరించారు. స్థానిక స్వదేశీ మత్స్యకారులు చేపల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, సాగు పద్ధతుల గురించి బిహార్ బృందం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంగమారిపేట వద్ద ఆర్‌జీసీఏను సందర్శించారు. కార్యక్రమంలో విశ్రాంత జేడీ కె.ఫణిప్రకాష్, ఏకే రెడ్డి, అవంతి, నైపుణ్య శిక్షణ అధికారి ఎం.విజయకృష్ణ, సహాయ సంచాలకురాలు లావణ్య, మత్స్యశాఖ అధికారి సుమాంజలి, మానుష, సొసైటీ అధ్యక్షుడు సింగిడి అప్పలరాజు, సింగిడి అప్పారావు పాల్గొన్నారు. 9న ఈ బృందం విశాఖపట్నంలో ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించనుంది.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- కొనియాడిన వక్తలు
- వర్ధంతి వేళ విప్లవ వీరుడికి ఘన నివాళులు


అల్లూరికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నివాళులు అర్పిస్తున్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు


చిట్టివలస సిటు కార్యాలయం వద్ద నివాళులు


భీమిలిలో అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు


పాండ్రంగిలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు

మధురవాడ: మన్యం వీరుడు అల్లూరి బ్రిటిష్ వారిపై చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం పలు ప్రాంతాల్లో ఆయనకు నివాళులర్పించారు.

➡ చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్దనున్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు, పోతిన రాంబాబు, వాండ్రాసి వినోద్, పిళ్లా శ్రీనివాసరావు, పి.మురళీకృష్ణ, కె.వి.ఎస్.రెడ్డి, ఎ.శ్రీనివాస్, పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

➡ 7వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని అల్లూరి విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, అధ్యక్షుడు నాగోతి ప్రకాశ్ పూలమాల వేసి అంజలి ఘటించారు. సభ్యులు ఎల్.ఎస్.నాయుడు, జగన్‌మోహన్ చౌదరి, బి.అప్పారావు, ఎం.వరలక్ష్మి, జోగారావు, రమేష్ పాల్గొన్నారు.

➡ భీమునిపట్నం: భీమిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి ఎంపీడీవో హనుమంతరావు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరాణి, పంచాయతీ విస్తరణ అధికారి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో..

పద్మనాభం: అల్లూరి స్వగ్రామం పాండ్రంగిలో ఆయన విగ్రహానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అముజూరి అప్పారావు, ఆర్.ఎస్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు కుచ్చర్లపాటి రామరాజు అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు.

➡ తగరపువలస: భీమిలి అల్లూరి పార్కులో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో పలువురు ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. చిట్టివలస సిటు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎస్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

మాస్టర్ ప్లాన్ రహదారుల పరిశీలన


తాళ్లవలసలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే గంటా

తగరపువలస: వీఎంఆర్డీఏ ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారులను సంస్థ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భీమిలి నియోజకవర్గంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఏయే రోడ్లు విస్తరించాలి, ఎక్కడ ఎలైన్‌మెంట్లు మార్చాలి తదితర అంశాలను మ్యాప్‌లతో సరిపోల్చి పరిశీలించారు. ఆర్‌డీపీ ఆమోదం పొందిన తరువాత రహదారులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భీమిలి మండలం తాళ్లవలస, బీచ్‌రోడ్డు, పాత అడవివరం, ఎస్‌జీఆర్ పురం, ఆనందపురం కూడలి, పెద్దిపాలెం కూడలి, దొరతోట కూడలి, నేరెళ్లవలస కూడలి మీదుగా పరిశీలన చేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఎస్టేట్ అధికారి దయానిధి, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం


అదృశ్యమైన లక్ష్మి


విష్ణువర్ధన్, దుర్గాప్రసాద్

పద్మనాభం: మండలంలోని చిన్నాపురంలో ఇద్దరు పిల్లలతో ఒక వివాహిత అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు అందించిన వివరాలివి.. చిన్నాపురం గ్రామానికి చెందిన కోన లక్ష్మి (28) ఈ నెల రెండో తేదీ సాయంత్రం ఆరు గంటల సమయంలో భర్తతో ఘర్షణ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు తమ ఇద్దరు కుమారులు విష్ణువర్ధన్(12), దుర్గా ప్రసాద్(8)లను తనతో పాటు తీసుకుని వెళ్లి పోయింది. బంధువుల ఇళ్లలో వెదికినా ఇప్పటివరకు ఆచూకీ లేకపోవడంతో భర్త నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయ సలహా కేంద్రాలపై అవగాహన


అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న సివిల్ జడ్జి సన్యాసినాయుడు

మద్రిపాలెం: న్యాయ సలహా కేంద్రాల ప్రాముఖ్యాన్ని ప్రజలకు వివరించే దిశగా అంగన్‌వాడీ కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లకు ఉచిత న్యాయ సలహాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు గృహ హింస, వేధింపుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించే విధంగా తీసుకొచ్చిన చట్టాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి భారత ప్రభుత్వం ఈ శ్రమ్ యోజనను ప్రారంభించిదన్నారు. వారి డేటాను సేకరించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందించడానికి ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించిందని చెప్పారు. అసంఘటిత రంగంలో పనిచేసే ఏ వ్యక్తి అయినా ఈ శ్రమ్ కార్డ్ ఫారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమాన్ని సీడీపీవోలు ఎం.వి.రమణకుమారి, ఎం.శ్రీలత పర్యవేక్షించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నరేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విపత్కర వేళ.. అప్రమత్తం ఇలా...

- ఏయూలో రక్షణ బలగాల మాక్ డ్రిల్







విశాఖలో కేంద్ర రక్షణ బలగాలు చేపట్టిన మాక్ డ్రిల్ ప్రజలను ఆలోచింపజేసింది. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రజానీకాన్ని అప్రమత్తం చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రక్షణ బలగాలు రంగంలోకి దిగాయి. విశాఖలోని డిఫెన్స్ వింగ్ (ఎన్‌డీఆర్ఎఫ్), ఎన్‌సీసీ సంయుక్తంగా బుధవారం ఆంధ్రా యూనివర్సిటీలో మాక్ డ్రిల్ నిర్వహించాయి. అత్యవసర సమయాల్లో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలనేది కళ్లకు కట్టినట్లుగా రక్షణ బలగాలు తమ విన్యాసాలతో చూపించాయి. యుద్ధ సమయంలో శత్రువుల దాడుల నుంచి తప్పించుకుని, ఎలా సురక్షితంగా బయటపడాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. యుద్ధ సమయంలో ఎలా వ్యవహరించాలనేది ఎన్‌సీసీ క్యాడెట్లు చేసి చూపించగా.., ఆపద సమయంలో ప్రజల ప్రాణాల రక్షణకు ఏ తీరుగా స్పందించాలనేది ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వివరించాయి. అత్యవసర సమయంలో ప్రాణ రక్షణకు ఏం చేయాలి, పిల్లలు, పెద్దల్లో భయాన్ని తొలగించేందుకు ఎలా స్పందించాలి, గాయపడిన వారికి ఎలాంటి చికిత్స అందించాలి, హుటాహుటిన ఆస్పత్రికి తరలించడం వంటి సన్నివేశాలను కళ్లకు కట్టినట్లుగా చూపారు. మాక్ డ్రిల్ నేపథ్యంలో ఏయూ ప్రాంగణంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఎన్‌సీసీ విభాగాధిపతి యుగంధర్, అధిక సంఖ్యలో విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ముందు జాగ్రత్త చర్యలు, అత్యవసర సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై ఎన్‌సీసీ అధికారి కల్నల్ తపస్ మండల్, డిఫెన్స్ వింగ్ అధికారులు అవగాహన కల్పించారు. - విశాఖ విద్య

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


మృతురాలు రామలక్ష్మి

తగరపువలస: ఆనందపురం మండలం బోయపాలెం సిగ్నల్ పాయింట్‌కు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా పోలిపల్లికి చెందిన మామిడి రామలక్ష్మి(45) దుర్మరణం చెందింది. బోయపాలెంలోని శ్రీచైతన్య కళాశాలలో చదువుకుంటున్న చెల్లెలు కుమార్తెను చూడటానికి మేనల్లుడు మొయిద యోగీతో రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై వెళ్తూ కింద పడిపోయింది. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు

అల్లిపురం: ఆశీలమెట్ట దరి సంపత్ వినాయక దేవాలయం హుండీ ఆదాయం రూ.13, 50, 693 సమకూరినట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఈ మొత్తం 20 రోజులకుగాను లభించిందని పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ ఫౌండర్ టీఆర్ బోస్, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.